## 51% ఫిట్మెంట్‌తో పీఆర్సీ అమలుచేయాలి

**తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 51% ఫిట్మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) డిమాండ్ చేసింది. రెండో వేతన సవరణ రిపోర్టును ప్రభుత్వం త్వరగా తెప్పించుకుని అమలు చేయాలని కోరింది. టీఆర్టీఎఫ్ రాష్ట్రకార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డిలు మాట్లాడుతూ.. 2023జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ.. 2025 ఏప్రిల్ పూర్తవుతున్నా అమలు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. దేశంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని తెలిపారు. వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టేలా ప్రభుత్వం క్యాలెండర్‌ను రూపొందించాలని కోరారు. జూన్ 9న జరిగే ఉద్యోగుల జేఏసీ మహాధర్నాను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నేతలు లక్కిరెడ్డి సంజీవరెడ్డి, కావలి అశోక్‌కుమార్, కటకం రవికుమార్, జీ రాంరెడ్డి, మహేందర్‌రాజ్, కిరణ్‌జ్యోతి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కితాక్యూషూలో రాష్ట్ర బృందం పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం ఆదివారం అక్కడి ప్రముఖ పారిశ్రామిక నగరమైన కితాక్యూషూను సందర్శించింది. ఈ సందర్భంగా వారు కితాక్యూషూ మేయర్ కజుహిసా టకేచీతో భేటీ అయ్యారు. వారికి అక్కడి సాంప్రదాయ రీతిలో ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు పలువురు అధికారులు ఈ బృందంలో ఉన్నారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్య నగరమైన కితాక్యూషూ ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవడంతోపాటు జపాన్‌లో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఎదిగింది.

# కష్టాల్లో రైతులు.. విదేశాల్లో సీఎం

- **అకాల వర్షాలతో రైతన్నకు నష్టం**
- **కనీసం సమీక్షించని మంత్రులు**
- **ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి**
- **ఉమ్మడి ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నా ప్రయోజనం లేదు**
- **సోనియా, రాహుల్‌పై ఈడీ కేసు పెట్టినా స్పందించని రేవంత్**
- **కమ్యూనిస్టులు ఏమయ్యారు?**
- **బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం**
- **ఖమ్మంలో కల్వకుంట్ల కవిత**



ఖమ్మం జిల్లా లింగాలలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం విదేశాల్లో విహరిస్తున్నారని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా తడిసిన ధాన్యాన్ని కొనే పరిస్థితిలేదని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ కేసు పెట్టినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. రెండురోజుల ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఖమ్మం వచ్చిన కవిత.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినా, ఒక్క మంత్రి కూడా సమీక్ష చేయడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ కర్షకుల కష్టాలు, తడిసిన ధాన్యం గురించి ఆలోచించకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఒకరి మీద మరొకరు ఆధిపత్యం చెలాయించుకోవడమే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రులు ములుగు పర్యటనకు వెళ్లినప్పుడు దవాఖానలో పసిపాప మృతిచెంది, తల్లిదండ్రులు ఆవేదనతో పాపను చూపిస్తున్నా మంత్రులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు.

**లింగాల గ్రామంలో ఘన స్వాగతం**

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లింగాల గ్రామంలో తన అభిమాని దేవరపల్లి పట్టాభిరామ్ గృహప్రవేశానికి ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఆ గ్రామం పొలిమేరల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కవిత అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆత్మీయంగా ప్రసంగించారు.

### ముఖ్యమంత్రివి ఘోరమైన అబద్ధాలు

సీఎం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కావడంలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా చేశామంటూ ఘోరమైన అబద్ధాలు చెప్తున్నారని దుయ్యబట్టారు. రైతు కూలీలకు ఇస్తామన్న ఆత్మీయ భరోసా ఏమైందని ప్రశ్నించారు. తాను ఖమ్మం రాగానే కాంగ్రెస్ నాయకుడొకరు తన బాధను వ్యక్తం చేస్తూ ఆ పార్టీ గ్రామ శాఖ పదవికి రాజీనామా చేశారని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేసిన నాయకులు కూడా ఆత్మపరిశీలన చేసుకొని, ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నారని పేర్కొన్నారు. కమ్యూనిసుల్టు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో ఆయా పార్టీలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నదని వ్యాఖ్యానించారు. 'ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పెద్దలు ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం వల్లే ప్రశ్నించడం లేదా?' అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పది నెలల్లోనే ఖమ్మం జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ నిర్మించి, 60 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలవుతున్నా ఖమ్మం జిల్లాకు ఒక్క పథకం గానీ, ప్రాజెక్టు గానీ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తాను ఇచ్చిన ప్రతీ మాట నెరవేర్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకం కోల్పోయిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ప్రతినిధులను ప్రజలు నిలదీయాలని కవిత పిలుపునిచ్చారు. ఈ నెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో తెలంగాణలో ఉత్సాహపూరిత వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. సభను విజయవంతం చేయాలని, ఖమ్మం జిల్లా నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పర్యటనలో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియానాయక్, మదన్‌లాల్, చంద్రావతి, బీఆర్‌ఎస్ నేతలు కోటేశ్వరరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లోనే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్

**అవకాశం కల్పించిన రవాణా శాఖ**



హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రవాణా శాఖ కల్పించింది. ఏ వాహనాన్ని నడపాలన్నా రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ అవసరం. కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునేవారికి వయసు ఆధారంగా కొన్నేండ్ల గడువుతో జారీ చేస్తారు. గడువు ముగిసేలోగా లేదా ముగిసిన 30 రోజుల్లోగా లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలి. లేకుంటే ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. గడువు ముగిసి చాలా రోజులైతే జరిమానా చెల్లించడంతోపాటు మళ్లీ కొత్త డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. మళ్లీ ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి పరీక్షకు హాజరు కావాలి.

**రెన్యువల్ చేసుకోవడం ఇలా..**

- రవాణాశాఖ వెబ్‌సైట్‌లో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌పై క్లిక్ చేయాలి.
- పేజీ లోడ్ అయిన తర్వాత స్లాట్ బుకింగ్ కంటిన్యూపై క్లిక్ చేయాలి.
- అనంతరం రెన్యువల్ ఆఫ్ లైసెన్స్‌ను ఎంచుకుని జీవోపై క్లిక్ చేయాలి.
- డ్రైవింగ్ లైసెన్స్ నంబర్, జారీ చేసిన ఆర్టీఏ కార్యాలయం, పుట్టిన తేదీ, సెల్‌ఫోన్ నంబర్‌తోపాటు క్యాప్చా వివరాలను పొందుపర్చాలి.
- రిక్వెస్ట్ ఓటీపీపై నొక్కితే మీ సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేశాక గెట్ డీటెయిల్స్‌పై క్లిక్ చేస్తే వివరాలు కనిపిస్తాయి. వాటిని పరిశీలించాక కన్ఫామ్‌పై క్లిక్ చేసి, సేవ్ నొక్కితే మీ వివరాలు సేవ్ అవుతాయి.
- తదుపరి విండోలో స్లాట్ కోసం మనకు నచ్చిన తేదీ, సమయాలను ఎంచుకుని నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి.
- ఇప్పుడు చెల్లించాల్సిన రుసుమును పరిశీలించి పే నౌపై క్లిక్ చేయాలి. అనంతరం అనువైన ఆప్షన్‌కు డబ్బు చెల్లిస్తే స్లాట్ బుక్ అవుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వస్తుంది. వాటిని ప్రింట్ తీసుకోవాలి.
- మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌పై వైద్యాధికారితో సంతకం చేయించి, ఆధార్, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను స్లాట్ బుక్ అయిన రోజున ఆర్టీఏ కార్యాలయంలో అందజేస్తే కొద్ది రోజుల్లోనే రెన్యూవల్ అయిన డ్రైవింగ్ లైసెన్స్ వస్తుంది.

# ఢిల్లీ పెద్దలపై కాంగ్రెస్‌లో ధిక్కార స్వరాలు!

- **జై బాపు.. కార్యక్రమంపై అనాసక్తి**
- **రాష్ట్ర సమస్యలపై అధిష్ఠానం దృష్టి పెట్టడంలేదని అసంతృప్తి**
- **బీజేపీపై ఆందోళనలు చేస్తే ప్రయోజనమేంటని అభిప్రాయం**
- **గాంధీభవన్‌లో ముఖ్య నేతలు, కార్యకర్తల మధ్య పెద్దఎత్తున చర్చ**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఢిల్లీ పెద్దలపై అడుగడుగున ధిక్కార స్వరాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇటీవలే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌పై ముఖ్యనేత వర్గం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి అదే తరహా పరిస్థితి కనిపిస్తున్నదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయస్థాయిలో పిలుపునిచ్చిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్..' కార్యక్రమాన్ని అమలు చేసే విషయంలో రాష్ట్ర పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. ఎన్డీఏ సర్కార్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని 'జై బాపు..' కార్యక్రమాన్ని ఏఐసీసీ తలపెట్టింది. కానీ ర్యాలీలతో పెద్దగా ఉపయోగం ఉండదంటూ రాష్ట్ర నాయకత్వంలో అభిప్రాయం వ్యక్తమవుతున్నట్టు పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. ఏది ఏమైనా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాల్సిందేనని అధిష్ఠానం ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు రెగ్యులర్‌గా జూమ్ మీటింగ్‌లు పెట్టి ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**బలవంతంగా రుద్దుతారెందుకు?**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నదని, ప్రభుత్వాన్ని, పార్టీని సమస్యలు వేధిస్తున్నాయని రాష్ట్ర నేతలు చెప్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు, ప్రతిపక్షాలు ఎండగడుతున్నాయని వాపోతున్నారు. వాటిని తిప్పికొట్టడమే పెద్ద తలనొప్పిగా మారితే, ర్యాలీలు చేయాలంటూ ఢిల్లీ నుంచి ఒత్తిడి చేయడమేంటని కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యంతో ఎమ్మెల్యేలు, నేతలు గుర్రుగా ఉన్నారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తెలంగాణలో పెద్దగా ప్రభావం లేని బీజేపీ గురించి జనంలో చర్చ పెట్టడం వల్ల ప్రయోజనమేంటని మరికొందరు కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నట్టు సమాచారం.

## కాంగ్రెస్ ప్రభుత్వం తప్పును సరిదిద్దుకుంటున్నది!

- **ఇంద్రవెల్లి బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది**
- **అమరవీరుల సంస్మరణ సభలో మంత్రి సీతక్క వాగ్దానం**



ఇంద్రవెల్లి అమరులకు నివాళులు అర్పించి, అభివాదం చేస్తున్న సీతక్క

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.15 కోట్లతో ఉట్నూర్‌తోపాటు ఏటూరునాగారంలో కొత్తగా ఐటీడీఏ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. పోడు భూములపై కమిటీ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపి, పట్టాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, ప్రేమ్‌సాగర్‌రావు, కోవ లక్ష్మి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో 58వ రోజుకు చేరిన రెస్క్యూ ఆపరేషన్**



ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట, ఏప్రిల్ 20 : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న మిగిలిన ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆ ఆరుగురి కోసం 58 రోజులుగా రెస్క్యూ సిబ్బంది అన్వేషణ చేస్తున్నా వారి ఆనవాళ్లు లభించడం లేదు. టన్నెల్‌లో డేంజర్ జోన్ అయిన డీ-1, డీ-2 ప్రదేశం వరకు సహాయక పనులు కొనసాగుతున్నాయి. అక్కడ టీబీఎంకు సంబంధించిన స్టీల్, ఇనుప పరికరాలు కటింగ్ చేస్తున్నారు. బండ రాళ్లు, స్టీల్ పరికరాలు కట్ చేసి, లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. డేంజర్ జోన్‌లో ఓవైపు జాగ్రత్తలు తీసుకుంటూ మరోవైపు స్టీల్ కటింగ్ పనులు చేపడుతున్నారు. పైనుంచి సిమెంట్ సెగ్మెంట్లు కూలిపడిపోకుండా సపోర్టు పెట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భారీగా వస్తున్న నీటిఊటను అధిక సామర్థ్యం గల మోటర్లతో బయటకు పంపుతున్నారు. డేంజర్‌జోన్‌గా పేర్కొన్న చివరి ప్రదేశానికి వెళ్లడం అతికష్టంగా మారింది. ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి అక్కడే ఉండి, సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# ఉపాధి హామీ.. ఏదీ జవాబుదారీ?

- **ఏటేటా పెరుగుతున్న ఫిర్యాదులు**
- **2023-24లో నమోదైన 2.87 లక్షల విజ్ఞాపనలు**
- **పరిష్కారమైన సమస్యలు 10.69 శాతం మాత్రమే**
- **2024-25లో 3.12 లక్షల ఫిర్యాదులు, 1.87 శాతం సాల్వ్**
- **గ్రామీణ ఉపాధి హామీ పథకం యాక్షన్ టేకెన్ రిపోర్టులో వెల్లడి**

**తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఏటీఆర్ నివేదికలు**



| ఆర్థిక సంవత్సరం | పేరాలు | పరిష్కరించినవి | శాతం |
|---|---|---|---|
| 2022-23 | 2,12,655 | 23,353 | 10.98 |
| 2023-24 | 2,87,137 | 30,691 | 10.69 |
| 2024-25 | 3,12,771 | 5,837 | 1.87 |

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించే ఉపాధి హామీ పథకం అమల్లో జవాబుదారీతనం లోపిస్తున్నది. గ్రామాల్లో వసతుల కల్పనకు, వ్యవసాయ తోడ్పాటుకు, రైతులకు ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకం అమలు తీరుపై ఏటేటా ఫిర్యాదులు (పేరాలు) పెరుగుతున్నాయి. ఏదైనా సమస్యను పరిష్కరించడంతోపాటు అది పునరావృతం కాకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం.. పట్టించుకోకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్) పథకం అమలులో అధికారుల జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తున్నది. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై ఏటా దేశవ్యాప్తంగా థర్డ్‌పార్టీ ద్వారా సోషల్ ఆడిట్ జరుగుతున్నది. క్షేత్రస్థాయిలో ఆడిట్ అధికారుల పరిశీలనకు వచ్చిన అంశాలు, సమస్యలు, పేరాలను డెసిషన్ టేకెన్ రిపోర్టు (డీటీఆర్)లో వెల్లడిస్తారు. డీటీఆర్ నివేదిక ఆధారంగా అధికార యంత్రాంగం యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్) తయారు చేస్తున్నది. అయితే, రెండేండ్ల ఏటీఆర్ నివేదికలను పరిశీలిస్తే పేరాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. నిధుల దుర్వినియోగం కూడా అదేస్థాయిలో అధికమవుతున్నది. ఇది అధికారుల జవాబుదారితనాన్ని శంకిస్తున్నది.

**నిబంధనల ఉల్లంఘన**

ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతిని నిర్మూలించేందుకు, పారదర్శకత, జవాబుదారితం పెంచేందుకు ఏటా ర్యాండమ్‌గా గ్రామాల్లో థర్డ్ పార్టీ సంస్థలతో ఆడిట్ నిర్వహిస్తారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నాలుగు విభాగాలుగా గ్రీవెన్స్ (ఫిర్యాదులు), ప్రాసెస్ వాయిలేషన్ (నిబంధనల ఉల్లంఘన), ఫైనాన్షియల్ డీవియేషన్ (పనుల కొలతల్లో తేడాలు), ఫైనాన్షియల్ మిస్ అప్రోపియేషన్ (నిధుల దుర్వినియోగం)పై స్వీకరిస్తారు. వీటిని పేరాలుగా పేర్కొంటారు. మొత్తం పేరాల నివేదికను ప్రభుత్వ యంత్రాంగానికి డెసిషన్ టేకెన్ రిపోర్టు (డీటీఆర్) రూపంలో అందజేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3,12,771 పేరాలు అందగా, వీటిలో కేవలం 5,837 పరిష్కరించారు. అంటే 1.87% మాత్రమే క్లోజ్‌చేశారు. ఏటేటా పేరాలు తగ్గకపోగా, పెరగడం గమనార్హం.



## ఆ శిల్పం బెజ్జమహాదేవిదే!

- **నిజామాబాద్ జిల్లా బెజ్జోర గుడి చాలా విశిష్టమైనది**
- **చరిత్ర పరిశోధకుడు కంకణాల రాజేశ్వర్ వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బెజ్జోర గ్రామంలోని బెజ్జందేవి గుడిలో ఉన్న శిల్పం పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో పేర్కొన్న బెజ్జమహాదేవి శిల్పమేనని కొత్త తెలంగాణ పరిశోధన బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒడిలో శిశువుతో ఉన్న ఆ విగ్రహం శివుణ్ణి పాపడిని చేసి లాలిస్తున్నట్టుగా ఉన్న బెజ్జమహాదేవి ప్రతిమను గుడిలో ప్రతిష్ఠించారని చెప్పారు. ఇది అరుదైన చారిత్రక సంఘటన అని, వీరశైవభక్తుల శిల్పాలలో అక్కమహాదేవి విగ్రహం ప్రసిద్ధమైందని వివరించారు.

# బాలభవన్ నిర్వీర్యం!

- **టీచర్లు లేక పలు శిక్షణ బంద్**
- **భవన్‌లో డిప్యూటేషన్ల రాజ్యం, సర్వత్రా పర్యవేక్షణ లోపం**
- **మూతపడుతున్న కేంద్రాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): జవహర్ బాలభవన్..! అనేక మంది ప్రముఖులను తీర్చిదిద్దిన శిక్షణాకేంద్రం. వేసవి వికాసానికి కేరాఫ్ అడ్రస్. సంగీతాల సవ్వడులు.. మువ్వల చప్పుళ్లు.. పిల్లల మధురగాత్రాలు.. ఇక్కడ వినిపించేవి. ప్రముఖ విద్వాంసులు ఓనమాలు నేర్పించేవారు.. శిక్షణనిచ్చేవారు.. సాంస్కృతిక పోటీలు జరిగేవి. ఇదంతా గతం. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా బాలభవన్‌లు నిర్వీర్యమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, శిక్షణనిచ్చేవారు లేకపోవడం, మొక్కుబడి పాఠాలతో గత వైభవ ప్రభను కోల్పోతున్నాయి. వేసవి శిక్షణా శిబిరాలు, చిన్నారుల ఆటపాటలతో కలకలలాడాల్సిన ఈ సంస్థ.. లయ తప్పింది. నిధులు, సిబ్బంది, పర్యవేక్షణ లేక కునారిల్లుతున్నది.

**డిప్యూటేషన్ల రాజ్యం**

రాష్ట్రంలో 10 జవహర్ బాలభవన్‌లు, 12 బాలకేంద్రాలు ఉన్నాయి. ఒక్కో భవన్‌లో ఎనిమిది మంది చొప్పున టీచర్లు, సిబ్బంది ఉండాలి. కానీ, టీచర్లు లేకపోవడంతో డిప్యూటేషన్ల రాజ్యం నడుస్తున్నది. మ్యూజిక్, డ్రాయింగ్, టైలరింగ్ శిక్షకులను నియమించాల్సిన చోట గణితం, సైన్స్, తెలుగు, హిందీ టీచర్లను డిప్యూటేషన్‌పై నియమిస్తున్నారు. కొన్నిచోట్ల కూచిపూడి, భరతనాట్యం శిక్షణ



అటకెక్కింది. సర్కారు బడుల్లో పాఠాలు చెప్పాల్సిన టీచర్లను డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి బాలభవన్‌లోని గ్రంథాలయాల్లో విధులు కేటాయించారు. ఇలా నలుగురు టీచర్లను నియమించినట్టు ఆరోపణలున్నాయి. పాఠశాలల్లో పాఠాలు చెప్పాల్సిన వారికి గ్రంథాలయాల్లో ఏం పని అన్న ప్రశ్నలొస్తున్నాయి. హనుమకొండ జిల్లాకు చెందిన ఒక టీచర్‌కు రెండేండ్ల సర్వీస్ ఉంటే, ఐదేండ్లు డిప్యూటేషన్‌పై నియమించడం గమనార్హం.

- హైదరాబాద్‌లో సమీపంలోని సర్కారు బడుల్లోని చిన్నారులను బాలభవన్‌కు తీసుకొచ్చేందుకు, కచేరీలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా బాలభవన్‌కు బస్సు ఉన్నా డ్రైవర్ లేడు. దీంతో బస్సు మూలనపడింది.
- ఓల్డ్‌సిటీలోని బాలభవన్‌లో శిక్షకులు లేకపోవడంతో దానిని మూసివేసినట్టు సమాచారం. వనస్థలిపురంలోని బాలకేంద్రానిదీ ఇదే పరిస్థితి. మరో నెలలో సికింద్రాబాద్ బాలభవన్ మూతపడనున్నది. కూకట్‌పల్లి, బేగంపేటలోని కేంద్రాల్లోనూ టీచర్లు లేరు.
- గతంలో తబలా, సితార్, మృదంగం, భరతనాట్యం, కూచిపూడి శిక్షణనిచ్చేవారు. ఇప్పుడు టీచర్లు లేకపోవడం, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి ప్రావీణ్యత లేకపోవడంతో శిక్షణ బంద్ అయింది.
- హైదరాబాద్‌లోని బాలభవన్‌లో రెగ్యులర్ సిబ్బందికి ఏడేండ్లుగా ప్రమోషన్లు లేవు.
- నాగార్జునసాగర్‌లో బాలభవన్, నల్లగొండలో బాలకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నల్లగొండలో నివాసం ఉండే ఒక అధికారికి నాగార్జునసాగర్‌కు వెళ్లడం ఇష్టంలేక, రెండింటినీ నల్లగొండలోనే నిర్వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఒక టీచర్ తొమ్మిదేండ్లుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది.
- నల్లగొండ జిల్లా నుంచి ఒక మ్యూజిక్ టీచర్‌ను ఖమ్మంకు బదిలీ చేశారు. కానీ, సదరు టీచర్ మూడేండ్ల నుంచి విధులకు డుమ్మా కొట్టి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.
- సికింద్రాబాద్ బాలభవన్‌లో పనిచేసే ఒక టీచర్‌పై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇటీవలే ఓ స్కూల్లో సమ్మర్ క్యాంపు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

**టీచర్ల కొరత ఉన్నది**

బాలభవన్‌లో టీచర్ల కొరత ఉన్నది. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంతోపాటు జిల్లాల్లోనూ ఒకరిద్దరు టీచర్లే ఉన్నారు. ఉన్నవారితోనే నడిపిస్తున్నాం. మరికొందరు డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. ఈ నెల 25న సమ్మర్ క్యాంపు నిర్వహించాలని నిర్ణయించాం. పలు అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎస్ విజయలక్ష్మి, బాలభవన్ డైరెక్టర్

**ఉత్సవాల్లేవు**

బాలభవన్‌లు పాఠశాల విద్యాశాఖ పరిధిలో నడుస్తున్నాయి. చాలాకాలంగా వీటికి రెగ్యులర్ డైరెక్టర్లు లేరు. ఇన్‌చార్జి డైరెక్టర్లతో నెట్టుకొస్తున్నారు. పర్యవేక్షణ లోపం, ఇన్‌చార్జిలు పట్టించుకోవడంతో అనేక వివాదాలు వెలుగుచూస్తున్నాయి. టీచర్ల మధ్య అంతర్గత కలహాలు సంస్థకు అప్రతిష్ఠను తెచ్చిపెడుతున్నాయి. బాల భవన్ ఆధ్వర్యంలో ఏటా స్టేట్ థియేటర్ ఫెస్టివల్‌ను నిర్వహించేవారు. బాలసూర్య, బాలరత్న పోటీలను నిర్వహించి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేసేవారు. ఇప్పుడు అదంతా గతం! హైదరాబాద్ జంట నగరాల్లోని చిన్నారులకు ఇంటర్‌స్కూల్స్ పోటీలు నిర్వహించే వారు, వేసవి వస్తున్నదంటే సమ్మర్ క్యాంపులతో బాలభవన్‌లు, బాలకేంద్రాలు కళకలాడేవి. గతంలో ఏటా మూడు వేల మంది విద్యార్థులు చేరేవారు. కానీ, ఇప్పుడు మూడు వందల మందిలోపే పేర్లను నమోదు చేసుకుంటున్నారు. చాలామంది శిక్షణ మధ్యలోనే నిష్క్రమిస్తున్నారు.



నాగర్‌కర్నూల్ మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన మక్కలను కుప్పచేస్తున్న మహిళ

## ఉమ్మడి పాలమూరులో భారీ వర్షం

- **వడగండ్ల వానతో భారీగా పంట నష్టం, రైతుల ఆవేదన**
- **పాన్‌గల్‌లో పిడుగుపడడంతో 25 జీవాల మృత్యువాత**

నమస్తే న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 20 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ, చారగొండ, అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, బిజినేపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల్లో గాలివానతో వడగండ్లు పడ్డాయి. పలుచోట్ల వరి, మక్క పంటలు నేలకొరగ్గా, ఈదురు గాలులకు చాలాచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. నాగర్‌కర్నూల్ మార్కెట్‌యార్డులోనూ విక్రయానికి వచ్చిన మక్కలు తడిసి కొట్టుకుపోయాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చాకల్‌పల్లిలో పిడుగుపడి 25 జీవాలు మృత్యువాత పడ్డాయి. రైతులు భోరున విలపించారు. పెద్దమందడి, గోపాల్‌పేట మండలాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోళి మండల కేంద్రంలో గాలివానకు ఓ ఇంటి గోడ కూలిపోయింది.



పాన్‌గల్ మండలం చాకల్‌పల్లిలో పిడుగుపడి మృతిచెందిన జీవాలు, విలపిస్తున్న రైతులు

## మరో రైతు ఆత్మహత్య

- **మంచిర్యాలలో విషాదం**



జైపూర్, ఏప్రిల్ 20 : సాగుకోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పొనూరుకు చెందిన మంతెన కుమార్ (39) రెండెకరాల్లో వరి సాగు చేశాడు. నిరుడు రెండుసార్లు బోర్లు వేయించినా నీరు పడలేదు. పంట చేతికి అందక, దాదాపు రూ.4 లక్షలు అప్పుల పాలయ్యాడు. మనస్తాపం చెందిన ఆయన శనివారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. వైద్యులు పరీక్షించి, కుమార్ మృతి చెందినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.